## ఆవల తెలియని సంద్రం..



పట్టినంబాక్కం తీరంలో చేపల కోసం వల విసురుతున్న జాలరి - ఆంధ్రజ్యోతి, చెన్నై

## నిధులివ్వండి ప్లీజ్!

### నిర్మలమ్మకు రాష్ట్ర విత్తమంత్రి వినతి



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంత్రి తంగం తెన్నరసు

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చాలాకాలంగా పెండింగ్‌లో వున్న నిధులను తక్షణమే విడుదల చేయాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ఆర్థికమంత్రి తంగం తెన్నరసు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో డీఎంకే ఎంపీ కనిమొళి, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీలతో కలిసి నిర్మలమ్మతో భేటీ అయిన తంగం తెన్నరసు వినతిపత్రాన్ని అందించారు. జాతీయ ఉపాధి హామీ పథకానికి చెల్లించాల్సిన రూ.1,056 కోట్లు ఇంకా విడుదల కాలేదని, అందువల్ల ఈ పథకంలో కూలి చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ బకాయిలు సత్వరం చెల్లించాలని ఈ నెల 14వ తేది ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ రాసిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. అదే విధంగా త్వరలో పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించాలని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న పథకాలకు కూడా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా చెన్నై, మదురై, కోవై మెట్రో రైల్ ప్రాజెక్టులకు నిధులను త్వరగా కేటాయించాలని కూడా కోరారు. ఆయన విజ్ఞప్తిని పరిశీలించిన నిర్మల.. తగిన చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.



విద్యార్థినులకు షీల్డ్ అందించి అభినందిస్తున్న సీఎం స్టాలిన్, చిత్రంలో డిప్యూటీ సీఎం తదితరులు

## గణతంత్ర ప్రదర్శనలు భేష్!

### శకటాలకు బహుమతులు

- యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖకు తొలి బహుమతి
- ఎవర్‌విన్, క్యూఎంసీ కాలేజీలకు మొదటి ప్రైజ్
- ప్రదానం చేసిన సీఎం స్టాలిన్

అడయార్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో పాలుపంచుకున్న శకటాల్లో రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖకు తొలి బహుమతి లభించింది. అలాగే, ఎవర్‌విన్, క్వీన్ మేరీస్ కళాశాలలకు కూడా మొదటి బహుమతి లభించింది. వీటిని ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు. మెరీనా తీరంలోని కామరాజర్ సాలైలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఈ శకటాల ప్రదర్శన జరిగింది. జాతీయ జెండాను గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆవిష్కరించారు. ఆ తర్వాత పాఠశాల, కాలేజీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే, ఆయా శాఖలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించాయి. వీటిలో మొదటి మూడు శకటాలను ఎంపిక చేసి సీఎం స్టాలిన్ బహుమతులను ప్రదానం చేశారు. తొలుత పాఠశాలల్లో కొళత్తూరులోని ఎవర్‌విన్ హైస్కూల్‌కు మొదటి బహుమతి అందజేశారు. రెండో బహుమతిని మైలాపూర్ చిల్డ్రన్ గార్డెన్ స్కూల్, మూడో బహుమతి అశోక్ నగర్‌లోని ప్రభుత్వ మహిళా హైయ్యర్ సెకండరీ పాఠశాలకు ప్రదానం చేశారు. కళాశాలల్లో కొళత్తూరులోని ఎవర్‌విన్ కాలేజీ, ట్రిప్లికేణిలోని క్వీన్ మేరీస్ కాలేజీలకు మొదటి బహుమతి ప్రదానం చేశారు. అలాగే, ప్రభుత్వ శాఖల్లో మొదటి బహుమతిని యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖ దక్కించుకోగా, రెండో బహుమతిని హోం శాఖ, మూడో బహుమతి దేవాదాయ శాఖ దక్కించుకుంది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ప్రజా పనుల శాఖ కార్యదర్శి రీటా హరీష్ టక్కర్, పాఠశాల విద్యా కమిషనర్ కన్నప్పన్ తదితరులు పాల్గొన్నారు.

## 3 నెలల్లో పార్టీల జెండాలు తొలగించాల్సిందే

### హైకోర్టు మదురై బెంచ్ ఆదేశం



చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, నగర, పట్టణ పంచాయతీలు, జిల్లా పంచాయతీ యూనియన్‌కు చెందిన రహదారుల్లో ఉన్న అన్ని రాజకీయ పార్టీల జెండాలు, మతసంస్థల పతకాలు, ఉద్యమసంస్థలు, కార్మిక సంస్థల జెండాలన్నీ మూడు నెలల్లోగా తొలగించాలని హైకోర్టు మదురై ధర్మాసనం సోమవారం ఆదేశించింది. గడువులోగా జెండాలు, పతాకాలను పెట్టిన పార్టీలు, మతసంస్థలు వాటిని తొలగించకపోతే.. రాష్ట్రప్రభుత్వం పోలీసుల ద్వారా వాటిని తొలగించి, దానికయ్యే ఖర్చు ఆయా పార్టీలు, మత సంస్థల నుంచి వసూలు చేయాలని స్పష్టం చేసింది. రహదారులను ఆక్రమించుకుని ఈ జెండాలను పాతడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వాహనాల రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతోందని హైకోర్టు అభిప్రాయపడింది. మదురై విలాంగుడి ప్రాంతానికి చెందిన సిద్ధన్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో ఓ పిటిషన్ వేశారు. అన్నాడీఎంకేలో ఉన్న తాను పార్టీ 53వ వార్షికోత్సవం సందర్భంగా మదురై కూడల్‌పుదూరు ప్రాంతంలో పాత జెండాను తొలగించి కొత్త జెండా ఏర్పాటు చేయాలని నిర్ణయించానని, ఆ మేరకు కొత్త జెండా ఏర్పాటుకు అనుమతించేలా కార్పొరేషన్‌కు ఉత్తర్వులివ్వాలని కోరారు. ఇదే విధంగా మదురై బైపాస్ రోడ్డు బస్టాపు వద్ద అన్నాడీఎంకే జెండాను నాటేందుకు అనుమతించాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా శాఖ నేత కదిరవన్ పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి ఇలందిరయన్ తీర్పు తేదీ ప్రకటించకుండా వాయిదా వేశారు. సోమవారం ఉదయం ఆ రెండు పిటిషన్లపై ఆయన తీర్పు వెలువరించారు. బహిరంగ ప్రదేశాలలో రాజకీయ పార్టీల జెండాలు, మతసంస్థల పతాకాలు, కుల సంఘాల జెండాలు పెట్టడం వల్ల శాంతి భద్రతల సమస్యలు ఏర్పడుతున్నాయని, ఏ పార్టీ జెండా తొలగించినా ఆ పార్టీ కార్యకర్తలు ఆగ్రహంతో ప్రత్యర్థి పార్టీలకు చెందినవారిపై దాడులకు దిగటం ఆనవాయితీగా మారిందన్నారు. బహిరంగ ప్రదేశాలలో, రోడ్డు మార్జిన్ ఆక్రమించుకుని జెండా స్తంభం పెట్టడం వల్ల ప్రజలకు హాని జరుగుతుందనే విషయాన్ని ఎవరూ మరువకూడదన్నారు. ఇటీవల జెండాల ఎత్తుపై రాజకీయ పార్టీల మధ్య పోటీ కూడా అధికమైందని, ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకుని బహిరంగ ప్రదేశాల్లో, జాతీయ, రాష్ట్రీయ రహదారులను ఆక్రమించి పెట్టిన జెండాలను, మత, ఉద్యమ సంస్థలు, కార్మిక సంఘాలు పెట్టిన జెండాలను మూడు నెలల్లోగా తొలగించాలని న్యాయమూర్తి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జెండాలను తొలగించడంతోనే సరిపెట్టుకోకూడదని, రాజకీయ పార్టీలు చేసే వేడుకలు, మత సంస్థల ఉత్సవాలు, కార్మిక సంఘాల వేడుకల రోజుల్లో మాత్రమే జెండాలను పోలీసుల అనుమతి తీసుకుని పెట్టాలని, వేడుకలు పూర్తయిన వెంటనే వాటిని తొలగించాలని తీర్పులో పేర్కొన్నారు. తాము ఇచ్చిన తీర్పులోని అంశాలన్నీ సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిశీలించి, తమకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పార్టీ జెండాలను పెట్టేందుకు అనుమతించాలని కోరుతూ దాఖలైన రెండు పిటిషన్‌లను న్యాయమూర్తి తోసిపుచ్చారు.

## దళితుడే సీఎం కావాలి

### చిదంబరంలో గవర్నర్ రవి



సహజానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న గవర్నర్

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దళిత వర్గానికి చెందిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆకాంక్షించారు. సోమవారం చిదంబరంలో జరిగిన స్వామి సహజానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ.. ఇది శివుడు జన్మించిన నేలని, ఈ జన్మదిన వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా వుందన్నారు. స్వామి సహజానంద వెయ్యేళ్లకు పైగా మన దేవుడి మార్గదర్శకాలను పాటించిన వ్యక్తి అని, ఆయన దర్శన సమయంలో మనకు రెండు భిన్నమైన అభిప్రాయాలు కనిపిస్తున్నాయన్నారు. కాల్డ్‌వెల్ అమెరికా పత్రికలో భారతీయ సంస్కృతిని పూర్తిగా నాశనం చేస్తేనే మనం పరిపాలించగలమని రాశాడని, ఈ విషయాన్నే కాల్డ్‌వెల్ బ్రిటీష్ ప్రభుత్వానికి కూడా తెలియజేశాడని తెలిపారు. అందువల్లే ఇక్కడ మతమార్పిడి జరిగిందని, క్రైస్తవ మిషనరీలు ఇక్కడి వారిని మతం మార్చేందుకు యత్నించాయని వ్యాఖ్యానించారు. బ్రిటీష్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళిత వర్గాల ప్రజల్ని ఎలా పరిపాలించారో అర్థం చేసుకోవాలన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం 200 ఏళ్ల క్రితమే ముగ్గురు గవర్నర్లను నియమించి మన సంస్కృతి, సంప్రదాయాలను పరిశోధించి, వారిచ్చిన నివేదిక ఆధారంగా వాటిని నాశనం చేసే పనులు ప్రారంభించిందన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం రాక ముందు మనమంతా అందమైన వృక్షంగా ఉండేవారమని, ఆ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొమ్మల్ని నాశనం చేశారని మహాత్మా గాంధీ పేర్కొన్నారని గుర్తుచేశారు. దళిత వర్గాలు హత్యకు గురైన కీళవెన్మణి గ్రామంలో ఒక్కరికి కూడా సరైన ఇల్లు లేదని, అందుకే అక్కడ ప్రధాన మంత్రి గృహ నిర్మాణ పథకం ద్వారా ఇళ్లు నిర్మించే ప్రణాళిక చేపట్టామన్నారు. స్వామి సహజానంద విద్య ద్వారా మార్పు తీసుకురావచ్చని భావించి ఆ ప్రకారం సేవలు చేశారన్నారు. దళితవర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా రావాలని, సహజానంద కల నెరవేర్చేలా ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. అన్నామలై విశ్వవిద్యాలయంలో స్వామి సహజానంద పేరుతో ఒక పీఠం ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా వుండగా నందనార్ ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్ హాస్టల్ విద్యార్థులతో గవర్నర్ ముచ్చటించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. అంతకు ముందు చిదంబరం ఓం కుళం ప్రాంతంలో ఉన్న నందనార్ మఠంలో ఉన్న సహజానంద విగ్రహానికి గవర్నర్ పూలమాల వేసి నివాళులర్పించారు.

**ఈరోడ్ తూర్పు ఉప ఎన్నిక**

## బూత్ స్లిప్‌ల పంపిణీ ప్రారంభం



బూత్ స్లిప్‌లు అందజేస్తున్న ఉద్యోగులు

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలను పురస్కరించుకొని సోమవారం నుంచి ఓటర్లకు బూత్ స్లిప్‌లు అందిస్తున్నారు. ఫిబ్రవరి 5న జరుగనున్న ఉప ఎన్నికలో డీఎంకే, నామ్ తమిళర్ పార్టీ అభ్యర్థులు సహా 46 మంది పోటీచేస్తున్నారు. ఈ ఎన్నికల్లో 85 ఏళ్లు నిండిన వారు, దివ్యాంగులు తపాలా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నేపథ్యంలో, ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజగోపాల్ ఉత్తర్వులతో ఎన్నికల సిబ్బంది ఓటర్ల ఇళ్లకే వెళ్లి బూత్ స్లిప్‌లు అందిస్తున్నారు.. 1వ తేదిలోపు ఓటర్లందరికి బూత్ స్లిప్‌లు అందజేయాలని ఎన్నికల అధికారి ఆదేశించారు.

## నిష్క్రమించిన నైరుతి



మంచు పరదాల మాటున సేలం నగరం

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది అక్టోబరు 15వ తేది ప్రారంభమైన నైరుతి రుతుపవనాలు తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, ఆంధ్ర తీరప్రాంతాల నుంచి సోమవారం నిష్క్రమించాయని భారత వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించింది. రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు 15న నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు 117 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షపాతం 2023వ సంవత్సరంతో పోల్చితే 15 శాతం అధికం. నైరుతి రుతుపవనాల సీజన్‌లో తిరునల్వేలి, సేలం, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూర్, విల్లుపురం తదితర జిల్లాల్లో సాధారణం కన్నా 59 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ప్రతి ఏటా అక్టోబరు 3వ వారం నుంచి డిసెంబరు వరకు నైరుతి రుతుపవనాల సీజన్ కాగా, ఈ ఏడాది జనవరి వరకు కొనసాగాయి. ఈ నేపథ్యంలో, నైరుతి రుతుపవనాలు తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, ఆంధ్ర తీర ప్రాంతాల నుంచి సోమవారంతో నిష్క్రమించాయని వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించింది. రాష్ట్రంలో 100 రోజులకు పైగా వర్షాలు కురవగా, సాధారణం కన్నా 33 శాతం అధిక వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

### సేలం జిల్లాలో మంచు, చలి....

సేలం జిల్లాలో గత వారం రోజులుగా వేకువజామున మంచు దట్టంగా అలముకోవడం, దానికితోడు చలి కూడా ఉండటంతో ఆ జిల్లా వాసులు వణికిపోతున్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం ఏర్కాడులో, ఆత్తూరు, వాళప్పాడి, ఓమలూరు, ఎడప్పాడి, మేట్టూరు, శంకగిరి, వీరపాండి ప్రాంతాల్లో ఉదయం 11 గంటల వరకు మంచు కురుస్తుండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రం సేలం నగరంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

## ఉమర్ ఆలీషా సాహిత్యం ప్రపంచానికే ఆదర్శం

### మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ సదస్సులో వక్తలు



సత్కార గ్రహీతలతో ఆచార్య విస్తాలి శంకర్‌రావు, డాక్టర్ ఉమర్ ఆలీషా తదితరులు

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మశ్రీ డాక్టర్ ఉమర్ ఆలీషా సాహిత్యం ప్రపంచానికే ఆదర్శమని మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో వక్తలు పేర్కొన్నారు. ' డాక్టర్ ఉమర్ అలీషా సాహిత్యం-బహుముఖీనత" అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ సభలో పాల్గొన్న వక్తలు ఉమర్ ఆలీషా సాహిత్యం ప్రసంశనీయమని కొనియాడారు. మెరీనాలోని రజతోత్సవం ప్రాంగణంలో మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు తెలుగు తల్లి ప్రార్థనా గీతంతో ఈ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా విస్తాలి శంకర్‌రావు మాట్లాడుతూ.. ఉమర్ ఆలీషా సాహిత్యంపై సదస్సు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని, ఆయన సాహిత్యం ఎంతో సరళంగా, సామాజిక దార్శనికతను తెలియజేసేలా ఉంటుందన్నారు. ఉమర్ సాహిత్యం అటు ప్రాచీనానికి, ఇటు చరిత్రకి, ఆధునిక భావాలకు, విలక్షణమైన ప్రక్రియలకు వేదికలుగా నిలవడమే కాకుండా ఎంతో ఆధ్యాత్మిక, సామాజిక స్ఫూర్తిని కలిగిస్తుందని కొనియాడారు. ఇన్ని విశేషాలు కలిగిన ఉమర్ ఆలీ సాహిత్యానికి, సాహిత్య చరిత్రలో సముచిత స్థానం దక్కలేదన్నారు. విలక్షణ సాహిత్యాన్ని ఎంత దాచివుంచినా ఏదో ఒకరోజు దాని చైతన్యం విశ్వవ్యాప్తమవుతుందని, ఆ రీతిలో ఉమర్ ఆలీషా ధ్రువతారగా నిలుస్తారని విస్తాలి ఆశాభావం వ్యక్తంచేశారు. ముఖ్యఅతిథి, పిఠాపురానికి చెందిన విశ్వ విజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠాధిపతి డా.ఉమర్ ఆలీషా మాట్లాడుతూ.. మద్రాసు విశ్వవిద్యాలయ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఉమర్ సాహిత్యంపై వచ్చిన పరిశోధనా పత్రాలను సంచిక రూపంలో తీసుకురావడం, ఆ సంచికను ఆవిష్కరించడం మరింత ఆనందంగా ఉందన్నారు. విశిష్ఠ అతిథిగా పాల్గొన్న హైదరాబాద్‌లోని యోగాలయ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డా.వాసిలి వసంత్‌కుమార్ మాట్లాడుతూ... అక్షరమూర్తిగా ఉమర్ ఆలీషా సాహిత్య ప్రస్థానం గొప్పదని కీర్తించారు. తొలిరోజు సదస్సులో గౌరవ అతిథిగా ఆఫ్రికాకు చెందిన ఆచార్య శ్రీదేవి శ్రీకాంత్, గుంటూరుకు చెందిన రచయిత్రి ఆచార్య సీహెచ్ సుశీలమ్మ, అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ తెలుగు శాఖ మాజీ అధ్యక్షులు ఆచార్య షేక్ మస్తాన్, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, హైదరాబాదులోని ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డా.కోయి కోటేశ్వరరావు తదితరులు పాల్గొని ఉమర్ ఆలీషా సాహిత్యాన్ని కొనియాడారు.

మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన నాలుగు సమావేశాల అధ్యక్షులుగా డా.ఎస్ ఎలిజబెత్ జయకుమారి, చిట్టిబోయిన స్వరాజ్యభారతి, డా.టీఆర్ఎస్ సుబ్రమణ్య శర్మ, డా.పట్టపు శివకుమార్ వ్యవహరించగా, మొత్తం 28పత్రాలు సమర్పించిన సమర్పకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. డా.మాదా శంకర్ బాబు వందన సమర్పణతో మొదటి రోజు కార్యక్రమం ముగిసింది.

## సమాచార దృష్టి

### పళని ఆలయంలో మూడు రోజులు ఉచిత దర్శనం

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పళని మురుగన్ ఆలయంలో తై మాస ఉత్సవాల సందర్భంగా మూడు రోజులు ఉచిత దర్శనం కల్పించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా మురుగన్ ఆలయాల్లో తై మాసం వేడుకలు ఘనంగా నిర్వహిస్తుంటారు. పళని ఆలయంలో జరిగే ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరవుతుంటారు. భక్తుల సౌకర్యార్థం ఫిబ్రవరి 11,12,13 తేదీల్లో ఉచితంగా స్వామి దర్శనం కల్పించారు. ఉత్సవాలకు వచ్చే సుమారు 2 లక్షల మంది భక్తులకు అన్నదానం, నగరంలో ఉచిత బస్సు సేవలు కల్పించనున్నట్లు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.

### పూర్తిస్థాయికి వీరాణం చెరువు

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) వీరాణం చెరువు ఈ ఏడాది తొలిసారి పూర్తి స్థాయికి చేరింది. కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్ సమీపంలోని వీరాణం చెరువు పూర్తి సామర్థ్యం 47.50 అడుగులు. ఈ చెరువుకు కీళనై నది నుంచి వడవారు మీదుగా నీరు వస్తోంది. ఈ ఏడాది తొలిసారిగా సోమవారం ఉదయం డ్యాం పూర్తి స్థాయికి చేరుకుంది. చెన్నై నగర ప్రజలు తాగునీటి అవసరార్థం వీరాణం నుంచి 74 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### మూడు రోజుల ఆధ్యాత్మిక పర్యటన

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో తిరుచెందూర్, రామేశ్వరం తదితర ప్రాంతాలకు మూడు రోజుల ఆధ్యాత్మిక పర్యటన ఏర్పాటుచేశారు. వాలాజా రోడ్డు సమీపంలోని కార్పొరేషన్ కార్యాలయం నుంచి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు బయల్దేరి తిరుచెందూర్, ఉత్తిరకోసమంగై, రామేశ్వరం తదితరాలు సందర్శించి సోమవారం ఉదయం నగరానికి చేరుకుంటుంది. ఈయాత్రకు వచ్చే భక్తులకు పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ గెస్ట్ హౌస్‌లో బస, భోజన వసతి కల్పిస్తారు. ఆసక్తి కలిగిన వారు www.ttdconline.com అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుచేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 1800 4253 1111 అనే టోల్ ఫ్రీ నెంబరు, 044-25333333, 044-25333444 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

### 'ఈ-వేలం' ద్వారా వాణిజ్య సముదాయాల విక్రయాలు

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) స్థానిక తిరువాన్మియూర్, షోలింగనల్లూర్, చిత్తలపాక్కం ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలను ఈ-వేలం ద్వారా విక్రయించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా గృహ సముదాయాలు నిర్మిస్తున్న హౌసింగ్ బోర్డు, ఆయా ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు కూడా ఏర్పాటుచేస్తోంది. ఇప్పటివరకు వీటిని మాన్యువల్‌గా అద్దె, విక్రయాలు చేపడుతుండగా, అధికంగా రియల్‌ఎస్టేట్ సంస్థలు వాణిజ్య సముదాయాలు పొందుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈవ్యవహారంపై దృష్టిసారించిన హౌసింగ్ బోర్డు, తిరువాన్మియూర్, షోలింగనల్లూర్, చిత్తలపాక్కంలో ఉన్న 26 వాణిజ్య సముదాయాలను ఈ-వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించింది. వివరాలు తెలుసుకొనేందుకు www.tnhb.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని హౌసింగ్ బోర్డు ప్రకటనలో తెలిపింది.

### 8న గ్రామీణ ప్రతిభా పరీక్ష

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రతిభా పరీక్ష మళ్లీ వాయిదాపడింది. రాష్ట్రంలోని గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించేలా ఉపకారవేతనం అందజేస్తుంటారు.అందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష పెడతారు. ఒక్కో జిల్లాకు 50 మంది విద్యార్థులు, 50 విద్యార్థినులు అని మొత్తం 100 మందిని ఎంపిక చేసి 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఏడాదికి రూ.1,000 అందజేస్తుంటారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రతిభా పరీక్ష డిసెంబరు 14వ తేది జరుగుతుందని ప్రకటించగా, వర్షాల కారణంగా ఫిబ్రవరి 1వ తేదీకి వాయిదావేశారు. ఈ నేపథ్యంలో, భారతీయ స్కౌట్స్ వజ్రోత్సవాలు ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3వ తేది వరకు తిరుచ్చి జిల్లా మనప్పారైలో జరుగనున్నాయి. దీంతో ప్రతిభా పరీక్ష ఫిబ్రవరి 8వ తేదీకి వాయిదావేసినట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ డైరెక్టర్ లత ప్రకటన విడుదల చేశారు.

### పింక్ ఆటోలు నడిపే 250 మంది మహిళలకు శిక్షణ

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులకు భద్రత కల్పించేలా మహిళలతో 'పింక్ ఆటో' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో ప్రకటించింది. తొలివిడతగా రాజధాని నగరం చెన్నైలో 25 నుంచి 45 ఏళ్లలోపుండి డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన 250 మహిళలతో ఈ పథకం ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఆసక్తి కలిగిన మహిళలు నుంచి దరఖాస్తు స్వీకరణ పూర్తికాగా, లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. 250 మంది మహిళలు ఆటోలు కొనుగోలు చేసేందుకు రూ.లక్ష సబ్సిడీ ఇవ్వనున్నారు. ఎంపిక చేసిన వారికి తమిళనాడు నైపుణాభివృద్ధి సంస్థ, టీఎన్ ఆటో స్కిల్స్ సంస్థలు సంయుక్తంగా శిక్షణ ఇస్తున్నాయి. ఆటోల సురక్షిత ప్రయాణం, ప్రయాణికుల భద్రత, డిజిటల్ విధానంలో నగదు చెల్లింపు, జీపీఎస్ పరికరం పనితీరు తదితరాలపై శిక్షణ ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# గవర్నర్ పర్యటనపై నిరసన

● 'ఇండియా' కూటమి నేతల అరెస్ట్

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో రాష్ట్ర గవర్నర్ పర్యటనను వ్యతిరేకిస్తూ 'ఇండియా' కూటమి పార్టీలు ఆందోళన చేపట్టాయి. చిదంబరంలో స్వామి సహజానంద జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు గవర్నర్ ఆర్ఎన్ రవి సోమవారం ఉదయం వచ్చారు. గవర్నర్ పర్యటనను వ్యతిరేకిస్తూ ఇండియా కూటమి నేతలు, కార్యక్రమంలో చిదంబరం రోడ్డులోని అన్నా విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఎం నగర కార్యదర్శి రాజా ఆందోళనకు నాయకత్వం వహించారు. ఆర్ఎస్ఎస్‌కు మద్దతుగా గవర్నర్ మత ప్రచారం చేపడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, గవర్నర్‌ను కేంద్రం వెంటనే రీకాల్ చేయాలంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఆందోళనలో కాంగ్రెస్, సీపీఐ, తమిళగ వాల్వురిమై పార్టీ, డీపీఐ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు వంద మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.



నిరసన తెలుపుతున్న ఇండియా కూటమి పార్టీలు

## ఇద్దరిని బలిగొన్న బైక్ రేస్



మృతులు హరీష్, మోహన్‌రాజ్ (ఫైల్ ఫోటోలు)

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లాలో బైక్ రేస్‌లో పాల్గొన్న ఇద్దరు యువకులు మృతి చెందారు. తిరుకోవిలూర్ సమీపంలోని రోడ్లపై మూడు రేస్ బైక్‌లపై ఇద్దరేసి కూర్చుని మొత్తం ఆరుగురు రేస్‌లో పాల్గొన్నారు. హారన్ కొడుతూ, అతివేగంగా వెళ్తున్న బైక్‌లు వాహనచోదకులు, ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయి. సైలోమ్ ప్రాంతంలో వెళుతుంగాట బైక్ ప్రమాదానికి గురైంది. ఈ బైక్ నడుపుతున్న మోహన్‌రాజ్, వెనక సీట్లో కూర్చున్న హరీష్ బైక్ నుంచి ఎగిరిపడి ఘటనా స్థలంలోనే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలు మాట్లాడలేదంటూ ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరువణ్ణామలై జిల్లాలో చోటుచేసుకుంది. తొండమానూరు గ్రామానికి చెందిన స్వదేశీ (19) చెన్నై ట్రిప్లికేన్‌లోని హాస్టల్‌లో ఉంటూ బీఎస్సీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఘటన జరిగిన రోజున కళాశాలకు వెళ్లి సాయంత్రం తన గదికి వచ్చాడు. గదిలో సహచరులు లేని సమయంలో స్వదేశీ ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటికి వచ్చిన సహచరులు, స్నేహితుడు ఉరేసుకొని మృతిచెందడం గమనించి దిగ్భ్రాంతి చెందారు. సమాచారం అందుకున్న ట్రిప్లికేన్ పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసుల విచారణలో... స్వదేశీ తన స్వగ్రామంలో ఓ యువతిని ప్రేమించాడని, మనస్పర్థల కారణంగా ఆ యువతి అతనితో మాట్లాడడం లేదని, ఈ కారణంగా స్వదేశీ ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. ఆత్మహత్యకు మరేదైనా కారణం ఉందా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వాటర్ హీటర్‌ఆన్‌చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతిచెందిన ఘటన వడపళనిలో చోటుచేసుకుంది.పోలీసుల సమాచారం మేరకు వడపళని ధారాసింగ్ కాలనీకు చెందిన అమియూస్ (28) అనే యువకుడు ఆదివారం రాత్రి స్నానం చేసేందుకు హీటర్ ఆన్‌చేశాడు. అప్పుడు విద్యుత్ షాక్ తగిలి స్పృహ కోల్పోయాడు. కుటుంబసభ్యులు అతనిని వడపళనిలో ఉన్న ఓ ప్రవేటు అస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అతను మరణించాడని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## విద్యార్థినులపై లైంగిక వేధింపులు

● ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెరంబూరులోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్న బాలికలు ఈ నెల 24వ తేదీ సాయంత్రం స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నామని కుటుంబ సభ్యులకు చెప్పి బయటకెళ్లారు. అయితే వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు వారికోసం పలుప్రాంతాల్లో గాలించి, జాడతెలియకపోవడంతో పోలీసులకు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు అదృశ్యమైన బాలికల సెల్‌ఫోన్ నెంబర్ ఆధారంగా గాలించారు. ఆ బాలికలు పెరంబూరు పరిధిలోని వీనస్ నగర్‌లో ఉన్నట్లు తెలుసుకుని, వారిని విడిపించేందుకు అక్కడికి వెళ్లారు. గదిలో తమ ప్రియులతో కలిసి ఉన్న ఆ ముగ్గురు బాలికలను ముత్యాలపేటలో ఉన్న ప్రభుత్వ మహిళా సంరక్షణ కేంద్రంలో అప్పగించారు. అనంతరం ఫోక్సో చట్టం కింద ముగ్గురు యువకులను అరెస్టు చేసి, జార్జ్‌టౌన్ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. నిందితులపై పలు పోలీసు స్టేషన్లలో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## తల్లిదండ్రులకు విద్యార్థుల పాదపూజ



పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి లతాంగి విద్యామందిర్ మెట్రిక్ హయ్యర్ పాఠశాలలో టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు, తమ తల్లిదండ్రులకు పాద పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. పొల్లాచ్చిలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో 10మంది శివాచార్యుల బృందం మంత్రోచ్చరణ, అమ్మయప్పన్‌కు అభిషేకం, పూజలు నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వాదం పొందారు. ఉపాధ్యాయుల ఆశీర్వాదం కూడా తీసుకున్నారు.

## ఎడప్పాడి పళనిస్వామి కేసు

● రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి 2021లో జరిగిన ఎన్నికల్లో సేలం జిల్లా ఎడప్పాడి నియోజకవర్గం నుంచి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పోటీ చేసి విజయం సాధించారు. ఆయన తన నామినేషన్ పత్రంలో ఆస్తుల వివరాలు సహా పలు ముఖ్యమైన సమాచారం తప్పు ఇచ్చారని, ఆయనపై ప్రజా ప్రతినిధుల చట్టం కింద చర్యలు చేపట్టాలని కోరుతూ తేని జిల్లాకు చెందిన మిలాని సేలం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన కోర్టు, ఆధారాల్లున్న కారణంగా కేసు నమోదుచేయాలని సేలం జిల్లా క్రిమినల్ పోలీసులను ఆదేశించింది. ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ పళనిస్వామి దాఖలుచేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు ఈ నెల 22న తోసిపుచ్చింది. ఈ ఉత్తర్వులకు స్టే విధించాలని కోరుతూ పళనిస్వామి తరఫున న్యాయవాది బాలాజి శ్రీనివాసన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించి, ఈ పిటిషన్‌పై తమిళనాడు ప్రభుత్వం, పిటిషనర్ మిలాని నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, ఈ కేసులో తదుపరి చర్యలు చేపట్టకుండా ధర్మాసనం తాత్కాలిక స్టే విధించింది.

## కృష్ణాలయం కూల్చివేత

● ఇద్దరు ఆత్మహత్యా యత్నం

● పోలీసుల మొహరింపు



ఆలయ కూల్చివేత దృశ్యం

అడయార్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్ళూరు సమీపంలోని పుల్లరంబాక్కంలోని వాహనాల రాకపోకలకు అంతరాయంగా ఉన్న కృష్ణాలయాన్ని అధికారులు కూల్చివేశారు. దీనిని వ్యతిరేకిస్తూ ఇద్దరు స్థానికులు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. దీంతో అక్కడ భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. ఈ వివరాలను పరిశీలిస్తే... 1979లో రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ సంతాన వినాయక ఆలయాన్ని నిర్మించారు. ఎంతో పురాతనమైన ఈ ఆలయం కాలక్రమంలో వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారింది. ఈ ఆలయాన్ని తొలగించాలని మద్రాస్ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన కోర్టు... ఆలయం కూల్చివేయాలంటూ ఆదేశించింది. దీంతో తిరువళ్ళూరు తహసీల్దారు నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది, ఎక్సకవేటర్లతో ఆలయాన్ని కూల్చివేసేందుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. వీరిలో ఇద్దరు నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పూనుకున్నారు. . ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్‌కు చేరవేయగా, ఆయన ఆదేశం మేరకు డీఎస్పీ తమిళరసి సారథ్యంలో వంద మంది పోలీసులను ఆలయం పరిసర ప్రాంతాల్లో మోహరించి ఆలయాన్ని కూల్చివేశారు. రెవెన్యూ అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసు బలగాలను భద్రతగా కొనసాగిస్తున్నారు.

## నీటి కోసం...!

### తోలంపాళయం గ్రామస్తుల రాస్తారోకో



ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నెలరోజులకు పైగా నీరు రావడం లేదంటూ ఖాళీ బిందెలతో ప్రజలు రాస్తారోకో చేపట్టారు. కోయంబత్తూర్ జిల్లా తోలంపాళయం పంచాయతి పరిధిలో కోబనారి, పట్టిసోలై, సీంగులి, ఆలంకండి, అలంకనడిపుదూర్, కాలని పుతూర్, సెంగుట్టై తదితర కొండ గ్రామాల్లో సుమారు వెయ్యి కుటుంబాలు నివసిస్తున్నాయి.. కేరళ సరిహద్దులో ఉన్న ఈ గ్రామాలకు సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని సమాచారం. ముఖ్యంగా, కాలనిపుదూర్ ప్రాంతానికి నెల రోజులు నీరు రావడం లేదు. ఈ విషయమై గ్రామస్తులు పంచాయతి ప్రతినిధులు, అధికారులకు తెలిపినా ఫలితం లేకపోయింది. దీంతో, ఆగ్రహం చెందిన వారు సోమవారం ఉదయం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. 'అధికారులు అక్కడకు చేరుకొని, నీటి సమస్య పరిష్కరిస్తామని హామి ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

## విదేశీ పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

● ఈపీఎస్ డిమాండ్

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఇటీవల జరిగిన ఆర్థిక ప్రపంచ సదస్సులో తమిళనాడు తరుపున పాల్గొన్న మంత్రి టీఆర్‌బీ రాజా సాధించిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదలచేయాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సు 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల దావోస్‌లో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాళ్ తదితర రాష్ట్రాలు అధిక పెట్టుబడులు సాధించి, ఒప్పందాలపై సంతకాలు చేసి తిరిగొచ్చాయి. అయితే రాష్ట్రప్రభుత్వం తరుపున ఆ సదస్సులో పాల్గొన్న పరిశ్రమ శాఖామంత్రి టీఆర్‌బీ రాజా ఏ మేరకు పెట్టుబడులు సాధించారో ఇప్పటివరకు నోరువిప్పలేదన్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రపంచ పెట్టుబడుల సదస్సులో రాబట్టుకున్న పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్ దావోస్‌లో రాష్ట్రానికి సంబంధించిన పెట్టుబడులపై వాస్తవాలను వివరించకుండా నిర్లక్ష్యం చూపుతున్నారని ఈపీఎస్ ఆరోపించారు.

## 'శాంసంగ్' కార్మిక సంఘం నమోదు

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శాంసంగ్ ఇండియా కార్మిక సంఘంను రిజిస్టర్ చేసినట్లు రాష్ట్ర కార్మిక శాఖ ప్రకటించింది. శ్రీపెరుంబుదూర్ సమీపంలో సుంకువారిసత్రం ప్రాంతంలో ఉన్న శాంసంగ్ ఫ్యాక్టరీలో సుమారు రెండువేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వేతనాల పెంపు, కార్మిక సంఘం గుర్తింపు, బోనస్ తదితర డిమాండ్లతో గత ఏడాది సెప్టెంబరులో 30 రోజులకు పైగా కార్మికులు సమ్మె చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వులతో కార్మికుల ప్రతినిధులతో చర్చలు జరిపిన రాష్ట్ర ప్రభుత్వం, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చింది. దీంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అల్పాహారం పథకాన్ని ప్రైవేటీకరణ చేయొద్దు

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పాఠశాలల్లో అల్పాహార తయారీ పనులను ప్రవేటీకరణ చేయొద్దని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి డిమాండ్ చేశారు. అయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో, జీసీసీ పరిధిలోని పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉదయం అల్పాహారాన్ని పంపిణీ కోసం ప్రవేటు సంస్థ నుంచి టెండర్లు కోరిందని, ఈ నిర్ణయం ఖండించదగ్గదని తెలిపారు. విద్యార్థులకు నాణ్యత, శుభ్రమైన ఆహారాన్ని వేడిగా అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అల్పాహార పథకానికి అనుమతిచ్చినట్లు తెలిపారు. అల్పాహార తయారీ పథకాన్ని ప్రవేటీకరణ చేస్తే విద్యార్థులకు సకాలంలో ఆహారం అందదని, నాణ్యత కూడా లోపిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు

● ఇళ్ళు కూల్చివేసిన అధికారులు

అడయార్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కుండ్రత్తూరు సమీపంలోని మాంగాడులో ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మించిన నాలుగు ఇళ్లను అధికారులు కూల్చివేశారు. ఇళ్ల కూల్చివేతను స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళనకారులతో చర్చించి, వారిని శాంతపరిచారు. ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని ఇల్లు నిర్మించినట్టు గుర్తించిన రెవెన్యూఅధికారులు ఆ ఇళ్లను కూల్చివేయించారు.

## క్వారీ నీటిలో మునిగి తల్లీకుమార్తెల మృతి

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): క్వారీలో చేరిన నీటిలో మునిగి తల్లి, ఇద్దరు కుమార్తెలు మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. తిరుప్పూర్ జిల్లా పల్లడం సమీపంలోని మేళంపాళయంలో క్వారీ ఉంది. ఈ క్వారీ గోతుల్లో చేరిన నీటిలో బట్టలు ఉతికేందుకు సోమవారం మధ్యాహ్నం ఓ మహిళ, తన ఇద్దరు కుమార్తెలతో కలసి వెళ్లింది. లోతు తెలియక ముగ్గురు నీటమునిగారు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని ముగ్గురు కోసం గాలిస్తున్నారు.

## ఉత్తరాది కార్మికుడి హత్య

● నిందితుడి పరార్

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్క్‌టౌన్ కొండితోప్‌లో వలస కార్మికుడిని హతమార్చి పరారైన ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కొండితోపులోని పొన్నప్పన్‌వీధిలో స్టీల్ పాత్రల కంపెనీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సదాబ్ అలీ (37) ఆ కంపెనీ ప్రాంగణంలో శవమైపడివున్నడనే సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అనంతరం విచారించగా ఒకే కంపెనీలో పనిచేస్తున్న యూపీకి చెందిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో గొడవ పడడంతో ఈ హత్య జరిగినట్లు నిర్ధారించారు. ఘటన జరిగిన రాత్రికి రాత్రే పరారైన యూపీకి చెందిన సలీం కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# వైద్యురాలి పేరుతో నిత్య పెళ్లికుమార్తె

● నాలుగో పెళ్లి చేసుకుని చిక్కిన కి'లేడి'

అడయార్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైద్యురాలి పేరుతో నిత్య పెళ్ళికుమార్తెగా మారిన ఓ కిలేడీని మైలాడుదురై జిల్లా సీర్గాళి పోలీసులు అరెస్టు చేశారు. ఈ పెళ్ళికి సంబంధించిన కట్టిన బ్యానర్లలో ఫొటో వేయడంతో ఆమె బండారం బయటపడింది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, సీర్గాళికి చెందిన శివచంద్రన్ ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్నారు. ఈయన చిదంబరం సమీపంలో బైకుపై వెళ్తుండగా, సీర్గాళి, కొడియంపాళెయం మత్స్యకార గ్రామానికి చెందిన లక్ష్మి (29) అనే మహిళ లిఫ్ట్ కోరడంతో శివచంద్రన్ ఎక్కించుకున్నారు. ఈ క్రమంలో ఆమె తనను తాను వైద్యురాలిగా పరిచయం చేసుకుంది. పైగా శివచంద్రన్‌కు వివాహం కాకపోవడంతో ఆమెను పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుని, ఈ నెల 20వ తేదీ హడావుడిగా పెళ్ళి చేసుకున్నారు. ఈ పెళ్ళి సందర్భంగా శివచంద్రన్ స్నేహితులు కట్టిన బ్యానర్లు సోషల్ మీడియాలో షేర్ చేయడంతోనే అసలు సమస్యలు మొదలైంది. ఆ బ్యానర్‌లోని ఫొటోను చూసిన లక్ష్మి రెండో భర్త నెపోలియన్ ఆశ్చర్యపోయారు. దీనిపై ఆయన సీర్గాళి ఆల్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో లక్ష్మిని స్థానిక పోలీసులు ఆదివారం ఠాణాకు పిలిపించి విచారించగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సిలంబరసన్ అనే వ్యక్తిని లక్ష్మి మొదట వివాహం చేసుకోగా ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. సిలంబరసన్ చనిపోవడంతో తన ఇద్దరు పిల్లలను తల్లి వద్ద వదిలిపెట్టి.. 2017లో పుదూరుకు చెందిన నెపోలియన్‌ను రెండో పెళ్లి చేసుకుంది. కొన్ని నెలలకు అతడ్నివదిలేసి 2021లో చిదంబరంకు చెందిన రాజా అనేవ్యక్తిని మూడో వివాహం చేసుకుంది. ఆ తర్వాత అతన్ని కూడా వదిలేసి నాలుగోసారి శివచంద్రన్‌ను వివాహం చేసుకుంది. దీంతో ఆమెపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈమె చేతిలో ఇదే విధంగా ఎవరైనా మోసపోయారా అనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తిరుముల్లైవాయల్ : తిరుముల్లైవాయల్ మొత్తం, సెంథిల్ నగర్ మొత్తం, కోవిల్‌పతాగై మొత్తం, వైష్ణవి నగర్ మొత్తం, నాగమ్మాయి నగర్, హెచ్‌వీఎఫ్ రోడ్డు, ఆవడి మార్కెట్, అశోక్ నగర్, గాంధీ నగర్, మోరై వీరాపురం, కన్నియమ్మన్ నగర్, టీఎస్పీ క్యాంప్, పొండాస్వరం, ఆరంబాక్కం, కొడువెలి, గౌడిపురం

రామాపురం: ఐపీఎస్ కాలనీ, రామాపురం ఏరియా, మనపాక్కం ఏరియా, మొగలివాక్కం, కొలపాక్కం మొత్తం, వెంకటేశ్వరనగర్, పూత్తపేడు,రామచంద్రనగర్ (గెరుగంబాక్కం), జైబాలాజి, ఖాన్‌నగర్, ఎంజీఆర్‌నగర్ నెసపాక్కం, కేకేపొన్నురంగం రోడ్డు (వలసరవాక్కం)

అడయార్: కెనాల్ బ్యాంక్ రోడ్డు (క్యాన్సర్ హాస్పిటల్), గాంధీ నగర్ 4వ మెయిన్ రోడ్డు కొంత భాగం, రెండవ కెనాల్ వీధి, గాంధీ నగర్, క్యాన్సర్ హాస్పిటల్ నుంచి వివేక్స్ షోరూమ్ వరకు, గాంధీ నగర్ 1,2,4 మెయిన్ రోడ్లు, గాంధీ నగర్ 2,3 క్రాస్ వీధులు, క్రిసెంట్ అవెన్యూ గాంధీ నగర్ (కుమారరాజ కాలేజ్), 1,2 క్రిసెంట్ పార్క్ రోడ్లు, గాంధీ నగర్ (పంపింగ్ స్టేషన్, మలర్ హాస్పిటల్, మల్లిపూ నగర్) 2వ మెయిన్ రోడ్డు, గాంధీ నగర్ 3వ మెయిన్ రోడ్డు కొంత భాగం, గాంధీ నగర్ 1వ క్రాస్ వీధి, కెనాల్ బ్యాంక్ రోడ్డు మొత్తం, 3వ కెనాల్ క్రాస్ వీధి నుండి 4వ మెయిన్ రోడ్డు వరకు, కామరాజ్ అవెన్యూ 1,2 వీధులు, టీచర్స్ కాలని, జస్టిక్ రామసామ్ అవెన్యూ, కస్తూరిభాయ్ నగర్ 7,8 వీధులు, 7,8,9,14,15 క్రాస్ వీధులు

కుండ్రత్తూర్: బాబు గార్డెన్, తిరుచెందూర్‌పురం, కొల్లచేరి, బజార్ వీధి, నాలు రోడ్డు కుండ్రత్తూర్, ఒండి కాలని, తిరుపతి నగర్, తిరుమలై నగర్, సుబ్బులక్ష్మి నగర్, శరవణ నగర్

తిరుముడివాక్కం: తిరుముడివాక్కం సిడ్కో 8వ వీధి, తిరుముడివాక్కం సిడ్కో మెయిన్ రోడ్డు లైన్, వేలాయుధం నగర్, మీనాక్షి నగర్, సతీష్ నగర్, తిరుముడివాక్కం టౌన్ కొంత భాగం, ఇందిరా నగర్, గురు నగర్, వివేకానంద నగర్, పలన్‌తండలం, నాగన్ వీధి

పెరుంగళత్తూర్: పూమాలై, మప్పేడు, కలైంజర్ నగర్, మురుగన్ అవెన్యూ, రూబి విల్లా, సాయి అవెన్యూ, వెంగంబాక్కం మెయిన్ రోడ్డు, ఎస్పీ అవెన్యూ, అశోక్ నగర్, ఎన్నార్కే నగర్, ఎంఎం విల్లా, జీకేఎం కాలేజ్

## మద్రాస్ క్రైస్తవ కళాశాలలో రేపటి నుంచి అంతర్జాతీయ సదస్సు




చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరంలోని మద్రాస్ క్రైస్తవ కళాశాల, నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి రెండు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. మద్రాస్ క్రైస్తవ కళాశాల సెమినార్ హాల్లో బుధవారం ఉదయం 10 గంటలకు 'ద్రావిడ భాషల్లో ప్రాచీన కావ్యాలు-తులనాత్మకత' అనే అంశంపై సదస్సు ప్రారంభం కానుంది. సదస్సు ప్రారంభోత్సవానికి క్రైస్తవ కళాశాల తెలుగుశాఖాధ్యక్షుడు డాక్టర్ ఎస్.యజ్ఞశేఖర్ అధ్యక్షత వహించనుండగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాల్‌విల్సన్ అభినందనలు తెలపనున్నారు. తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ప్రారంభోపన్యాసం, మైసూరు విశ్వవిద్యాలయం ప్రాచార్యులు ఆచార్య ఆర్వీయస్ సుందరం కీలకోపన్యాసం చేయనున్నారు. ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకులు చక్రవర్తి నాయుడు ముఖ్య అతిథిగా, యోగివేమన విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి విశిష్ట అతిథిగా, మద్రాస్ విశ్వవిద్యాలయం కన్నడ శాఖాధ్యక్షుడు ఆచార్య తమిళ్ సెల్వి, మలయాళ శాఖాధ్యక్షులు ఆచార్య పీఎం గిరీష్ గౌరవ అతిథులుగా, ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ వి.పళని ఆత్మీయ అతిథిగా హాజరుకానున్నారు. గురువారం మధ్యాహ్నం సదస్సు సమాపనోత్సవం జరుగనుంది. ఆచార్య మాడభూషి స్వాగతోపన్యాసం చేయనుండగా, ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ముఖ్య అతిథిగా, మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు విశిష్ట అతిథిగాహాజరుకానున్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు చెందిన ఆచార్య డి.విజయలక్ష్మి సమాపన సందేశం ఇవ్వనున్నారు. పలువురు పత్ర సమర్పణ చేయనున్నారు. అందరూ ఆహ్వానితులేనని యజ్ఞశేఖర్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## వెంబకోట తవ్వకాల్లో మట్టి ముంత లభ్యం



ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా వెంబకోట ప్రాంతంలో మూడో విడత తవ్వకాల్లో పురాతన కాలం నాటి మట్టి ముంత, గాజు పెంకులు సహా 3,200 పైగా వస్తువులు లభ్యమైయ్యాయి. ఈ నేపథ్యంలో వెంబకోట సమీపంలోని విజయకరిశల్‌కులం గ్రామంలో తాజాగా కాల్చిన మట్టితో తయారుచేసిన మానవ ఆకారం కలిగిన బొమ్మల శిథిలాలు, చిన్నారులు ఆడుకునేందుకు ఉపయోగించిన చిన్న మట్టిముంత, స్వేతవర్ణం గాజులు లభ్యమైనట్లు విరుదునగర్ జిల్లా పురావస్తు శాఖ పరిశోధనా విభాగం డైరెక్టర్ భాస్కర్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ, తాము చేపట్టిన తవ్వకాల్లో లభ్యమైన పురాతన అరుదైన శిలాఫలకాలు, పనిముట్లు, మట్టి శిథాలాలను భద్రపరచి, డిజిటలైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 18 గుంతలను పరిశోధనల కోసం తవ్వగా, ఎనిమిది గుంతలను పూడ్చివేశామని, మిగిలిన ఎనిమిది గుంతలను పొరుగు జిల్లాలకు చెందిన పాఠశాల విద్యార్థుల సందర్శనార్థం వదిలేసినట్లు తెలిపారు. త్వరలోనే వెంబకోట పరిధిలో అదనంగా మరికొన్ని గుంతలు తవ్వనున్నట్లు భాస్కర్ తెలిపారు.

## సబర్బన్ రైళ్లలో రోజుకు 8.5లక్షల మంది ప్రయాణం

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో నడుపుతున్న విద్యుత్ సబర్బన్ రైళ్లలో రోజుకు 8.5లక్షల మంది ప్రయాణం చేస్తున్నట్లు చెన్నై రైల్వే డివిజనల్ మేనేజర్ విశ్వనాథ్ సూర్య తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రైళ్లల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. చెన్నై బీచ్ - తాంబరం - చెంగల్పట్టు, చెన్నై సెంట్రల్-తిరువళ్లూరు - అరక్కోణం, చెన్నై సెంట్రల్ - గుమ్మడిపూండి మార్గాల్లో రోజుకు 600 సబర్బన్ రైళ్లను దక్షిణ రైల్వే నడుపుతోంది. ఈ నేపథ్యంలో చెన్నై రైల్వే డివిజనల్ మేనేజర్ విశ్వనాథ్ సూర్య సోమవారం మీడియాతో మాట్లాడుతూ, నగరంలో రోజుకు 11.5 లక్షల మంది రైళ్ల సేవలను వినియోగించుకుంటున్నారని, వీరిలో 8.5లక్షల మంది విద్యుత్ సబర్బన్ రైళ్లలో, 3లక్షల మంది ఇతర రైళ్లలో ప్రయాణం చేస్తున్నట్లు వివరించారు. చెన్నై రైల్వే డివిజన్‌లో నడుపుతున్న సబర్బన్ రైళ్ల ద్వారా గత డిసెంబరువరకు రూ.3,300కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల అభివృద్ధి పథకంలో తమ డివిజన్లో 17 రైల్వేస్టేషన్లలో రూ.200 కోట్లతో వసతులు మెరుగుపరస్తున్నట్లు తెలిపారు. మరో 160కోట్లతో 21 రైల్వేస్టేషన్లలో కొత్త ప్లాట్‌ఫామ్‌లు నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే నగరంలో సెంట్రల్, ఎగ్మోర్, తాంబరం రైల్వే టెర్మినళ్లు అందుబాటు ఉన్నాయని, కొత్తగా 4వ టెర్మినల్ పెరంబూరు-విల్లివాక్కం మధ్య ఏర్పాటుచేసేందుకు ప్రణాళిక రూపొందించి రైల్వే బోర్డు అనుమతి కోసం పంపించినట్లు తెలిపారు. చెన్నై-గూడూరు, చెన్నై-జోలార్‌పేట, అరక్కోణం-రేణిగుంట రైలు మార్గాల్లో 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడిపేలా ట్రాక్‌లను డిజైన్ చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల భద్రతను పటిష్టం చేసేలా, 40 రైల్వేస్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాట్లు పూర్తయ్యాయని, మరో 99 రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేస్తునట్లు విశ్వనాథ్ సూర్య తెలిపారు.



## రూటు మార్చిన ఇవానా!!

'లవ్‌టుడే' ఫేం ఇవానా రూటు మార్చారు. ఎంతో సంప్రదాయబద్ధంగా కనిపించే ఈ యువ హీరోయిన్ ఇపుడు గ్లామర్‌గా కనిపిస్తూ, ఫ్యాన్స్‌ను సైతం ఆశ్చర్య పరుస్తున్నారు. మాలీవుడ్‌కు చెందిన ఈ భామ అసలు పేరు అలీనా షాజీ. 24 యేళ్ళ ఈ ముద్దుగుమ్మ... దర్శకుడు బాలా తెరకెక్కించిన 'నాచ్చియార్' అనే మూవీ ద్వారా కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. జీవీ ప్రకాష్ కుమార్ హీరో. ఆ తర్వాత 'హీరో', 'లవ్ టుడే', 'ఎల్‌జీఎం', 'మదిమారన్', 'కల్వన్' వంటి పలు చిత్రాల్లో నటించారు. అయితే, 'లవ్‌టుడే' సినిమా తర్వాత ఈ అమ్మడు మార్కెట్ ఒక్కసారిగా పెరిగిపోయింది. దర్శక నిర్మాతలు సైతం ఇవానాను తమ చిత్రాల్లో బుక్ చేసుకునేందుకు పోటీపడ్డారు. దీంతో రెమ్యునరేషన్‌తో పాటు ఈ అమ్మడు క్రేజ్ కూడా ఒక్కసారిగా పెరిగిపోయింది.

# సినిమా రిలీజ్ తర్వాత గుడ్‌గర్ల్ అవుతుంది

### నిర్మాత ఎస్.థాను ● 'బ్యాడ్‌గర్ల్' టీజర్ రిలీజ్

బాలీవుడ్ దర్శక నటుడు అనురాగ్ కశ్యప్, కోలీవుడ్ దర్శకుడు వెట్రిమారన్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'బ్యాడ్‌గర్ల్'. సినిమా టీజర్‌ను నగరంలో ఆదివారం రిలీజ్ చేశారు. గ్రాస్‌రూట్ ఫిల్మ్ కంపెనీ పతాకంపై తెరకెక్కిన ఈ మూవీకి బాలీవుడ్ సంగీత దర్శకుడు అమిత్ త్రివేది స్వరాలు సమకూర్చారు. ఈయన తమిళ చిత్రానికి సంగీతం అందించడం ఇదే తొలిసారి. దర్శకుడు వెట్రిమారన్ వద్ద 'వడ చెన్నై', 'విచారణై' వంటి సినిమాలకు అసిస్టెంట్ గా పనిచేసిన వర్షా భరత్ ఈ సినిమా ద్వారా దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. 'కమింగ్ ఆఫ్ ఏజ్ ఫ్యామిలీ డ్రామా'గా రూపొందిన ఈ మూవీలో ప్రధాన పాత్రను అంజలి శివరామన్, శాంతిప్రియ, హృద్ హారూన్, టీజే అరుణాచలం, శరణ్యా రవిచంద్రన్ తదితరులు నటించారు. తుదిదశ చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం టీజర్‌ను నగరంలో విడుదల చేశారు. ఇందులో ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్. థాను, దర్శకుడు మిష్కిన్, హీరోయిన్ తాప్సీ ముఖ్య అతిథులుగా పాల్గొని టీజర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత థాను మాట్లాడుతూ, 'ఒక చిత్రం విజయానికి కొత్తదనంతో కూడిన పబ్లిసిటీ ముఖ్యం. నా వంతుగా ఈ టీజర్‌ను మరింత మందికి చేరువచేస్తాను. మీడియా కూడా ఆదరించాలి' అని కోరారు. హీరోయిన్ తాప్సీ మాట్లాడుతూ, '15 యేళ్ళలో తొలిసారి వెట్రిమారన్ ఒక సినిమాకు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. తరచూ పురుషులకు సంబంధించిన చిత్రాలే వస్తుంటాయి, మహిళలకు సంబంధించిన చిత్రాలు ఎందుకు రావడం లేదని ఆశ్చర్యపోతుంటాను. ఈ సినిమా కేవలం స్త్రీల సమస్యలను ప్రస్తావిస్తుంది. దర్శకురాలు కూడా మహిళే సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. దర్శకురాలు వర్ష మాట్లాడుతూ, 'వెట్రిమారన్‌కు కథలు చెబుతూనే ఉంటాం. వాటిని ఆలకించే ఆయన ఫీడ్‌బ్యాక్ ఇస్తుంటారు. అలాంటి మంచి ఫీడ్‌బ్యాక్ ఈ స్టోరీకి ఇచ్చారు. తమిళ సంప్రదాయంలో మహిళను తల్లితో సమానంగా చూస్తారు. కానీ, ఒక మహిళలోని నిజమైన భావాలు ఏమిటో చెప్పే కథ' అని పేర్కొన్నారు. అలాగే, వెట్రిమారన్, అనురాగ్ కశ్యప్, అంజలి శివరామన్, దర్శకుడు మిష్కిన్ తదితరులు ప్రసంగించారు. ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకురానుంది.



అనురాగ్ కశ్యప్, వెట్రిమారన్, వర్షా భరత్, అంజలి తదితరులు

తమిళ చిత్రజ్యోతి

## శశికుమార్ హీరోగా 'మై లార్డ్'

'జపాన్' వంటి డిజాస్టర్ మూవీ తర్వాత డైరెక్టర్ రాజు మురుగన్ మరో చిత్రానికి దర్శకత్వం వహించారు. శశికుమార్ కథానాయకుడు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను తమిళ హీరో ఆర్య (తమిళం), బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్, కన్నడ దర్శకుడు కన్నడ బి.శెట్టి, తెలుగు దర్శకుడు క్రిష్ , మలయాళ దర్శకుడు లిజో జోస్ కలిసి విడుదల చేశారు. ఇందులో హీరో శశికుమార్ లుక్‌ను సరికొత్తగా డిజైన్ చేయగా, ఇది ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇతర పాత్రల్లో చైత్ర గురుసోమసుందరం, ఆషా శరత్, దర్శకుడు గోపి నాయర్, వసుమిత్ర తదితరులు నటించనున్నారు. నిర్మాత ఎస్.అంబేత్‌కుమార్ సమర్పణలో ఒలింపియా మూవీస్ పతాకంపై నిర్మాత జయంతి అంబేత్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని తుదిదశ నిర్మాణ పనులను జరుపుకుంటుంది.



'మై లార్డ్' ఫస్ట్‌లుక్

## పుదుచ్చేరి కళాకారులతో 'మనిదం'

నిర్మాత కృష్ణరాజు యువర్ పేకర్స్ ప్రొడక్షన్, కావియం స్టూడియోస్ బ్యానర్లపై 'మనిదం' పేరుతో ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. జె.పురునో సావియో దర్శకుడు. మధునికా రాజలక్ష్మి ప్రధాన పాత్ర పోషించారు. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'పుదుచ్చేరి గడ్డపైనే చిత్రీకరణ పూర్తి చేసుకున్న తొలి చిత్రం. ఇందులో పుదుచ్చేరికి చెందిన కళాకారులే నటించారు. నిజమైన ప్రేమానురాగాలు, బంధాలను వివరించే ప్రయత్నం చేశాం. మంచివారు ఎవరు? చెడ్డవారు ఎవరు? అనే విషయం హీరోకు ఎలాంటి సమయం, సందర్భంలో తెలుస్తుందన్నదే ఈ కథాంశం. దీన్ని ఎంతో ఆసక్తికరంగా ఎమోషనల్ టచ్ తో రూపొందించాం' అని పేర్కొన్నారు. ఇదిలావుంటే, ఈ చిత్రం ఆడియోను తాజాగా రిలీజ్ చేశారు. కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్వీ ఉదయకుమార్, సీనియర్ నటుడు కె.భాగ్యరాజ్‌కు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆడియోను రిలీజ్ చేశారు.



'మనిదం' ఆడియో రిలీజ్ దృశ్యం

## ఏడు అవార్డులను గెలుచుకున్న సీయూబీ



అడయార్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో పురాతన ప్రైవేట్ బ్యాంకుగా గుర్తింపు పొందిన సిటీ యూనియన్ బ్యాంకు (సీయూబీ) ఇండియన్ బ్యాంకింగ్ అసోసియేషన్ (ఐబీఏ) బ్యాంకింగ్ టెక్నాలజీలో వరుసగా రెండో సారి ఏడు అవార్డులను గెలుచుకుంది. ఈ నెల 24న ముంబైలో '20వ వార్షిక టెక్నాలజీ సదస్సు ఎక్స్‌పో అండ్ సిటేషన్ 2024' పేరుతో జరిగిన సదస్సులో ఈ అవార్డుల ప్రదానం చేశారు. బ్యాంకు బెస్ట్ డిజిటల్ సేల్స్, పేమెంట్స్, ఎంగేజ్‌మెంట్, బెస్ట్ ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్, బెస్ట్ ఫిన్‌టెక్ అండ్ డిజిటల్ పేమెంట్ ఇండెక్స్ అడాప్షన్, బెస్ట్ ఫైనాన్షియల్ ఇంక్లూషన్, బెస్ట్ ఏఐ అండ్ ఎంఎల్ అడాప్షన్, బెస్ట్ టెక్నాలజీ టాలెంట్ అండ్ ఆర్గనైజేషన్, బెస్ట్ టెక్నాలజీ బ్యాంకు విభాగాల్లో ఈ అవార్డులను రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నర్ టి.రవిశంకర్ చేతుల మీదుగా సీయూబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ ఆనంద్ అందుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ ఆనంద్ మాట్లాడుతూ, వరుసగా రెండో యేడాది ఏబీఏ ఏడు అవార్డులు అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. తమ బ్యాంకు టెక్నాలజీని గుర్తిస్తూ ఐబీఏ ఈ అవార్డులను ప్రదానం చేస్తుందన్నారు. బ్యాంకు ఖాతాదారులకు నిరంతరం కొత్త ఐటీ ఆధారిత సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. 2024 ఆగస్టులో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో సీయూడీ కస్టమర్ల కోసం ఎనిమిది కొత్త డిజిటల్ సేవలను ప్రవేశపెట్టామన్నారు. మున్ముందు కూడా మరింత మెరుగైన ఐటీ సేవలను అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.

## కొట్టూర్‌పురంలో 'డెకార్జియస్' స్టోర్



చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొట్టూర్‌పురం గాంధి మండపం రోడ్డులో 'డెకార్జియస్' స్టోర్ ఏర్పాటైంది. దక్షిణ భారతదేశంలోని అతి పెద్ద గృహాలంకరణకు కేంద్రమైన ఈ సంస్థ చెన్నైలో మొదటిసారిగా స్టోర్ ప్రారంభించింది. నార్వేజియన్ మినిస్టర్ కౌన్సిలర్ మార్టిన్ అందల్, చెన్నైలోని నార్వేజియన్ కౌన్సిల్ అరవింద్ గోపీనాథ్, జెన్సన్ ఎండీ జాన్ ట్రైగ్వే, సంజయ్ వర్మ తదితరులు ఇటీవల ఈ స్టోర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో వాసుదేవన్ మాట్లాడుతూ.. మారుతున్న వినియోగదారుల షాపింగ్ అలవాట్లకు అనువుగా, దేశంలో ఇంటి అలంకరణ మెరుగుపరిచేలా అన్ని గృహాలంకరణ వస్తువులు అందుబాటులో వుంచినట్లు తెలిపారు.

## క్షయ వ్యాధిగ్రస్తులకు సహాయాల పంపిణీ



సహాయాలు అందజేస్తున్న ఎన్.కన్నన్, పమ్మల్ పన్నీర్‌సెల్వం తదితరులు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పసుమై తాయగం, గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు కొత్త దుస్తులు, మిఠాయిలు అందజేశారు. చెంగల్పట్టు సమీపం భరనూరులోని ప్రభుత్వ పునరావాస కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి పమ్మల్ పన్నీర్‌సెల్వం అధ్యక్షత వహించగా, ప్రత్యేక అతిథిగా పసుమై తాయగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.కన్నన్, చెంగల్పట్టు జిల్లా కార్యదర్శి తిరుచెందూర్ సెంథిల్‌నాథ్, నిర్వాహకులు గురు, పమ్మల్ సూనియమ్మన్ సహా పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పునరావాస కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు.

## యేడాదికొకమారు సంబరం ఎప్పనాడు ఆలయ ఉత్సవం

### ● పడుకర్ కులస్థుల సందడి



పీర్‌మూక్కు ఈశ్వరాలయం వద్ద గుమికూడిన భక్తులు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ సమీపంలోని ఎప్పనాడు గ్రామంలో యేడాదికొకమారు తెరిచే పీర్‌మూక్కు ఈశ్వరాలయ వార్షిక ఉత్సవం సోమవారం ఉదయం కనుల పండువగా జరిగింది. ఊటీ కొండ ప్రాంతాల్లో నివసించే పడుకర్ కులస్థులు ఈ వేడుకలను ప్రతియేటా ఘనంగా జరుపుతుంటారు. ఎప్పనాడు గ్రామం శివారులో నిట్టనిలువగా ఉన్న కొండపై ప్రాచీనమైన పీర్‌మూక్కు ఈశ్వరాలయం ఉంది. ఆలయం చూడటానికి చిన్నదే అయినా దాని కీర్తిమాత్రం మహోన్నతం. యేడాది ఒకమారు తెరచి నిర్వహించే వార్షికోత్సవాలకు పడుకర్ కులస్థులు ఏ దేశంలో ఉన్నా వేడుక సమయానికి స్వస్థలంలో వాలిపోతారు. ఆ విధంగానే పడుకర్ కులస్థులు తెల్లని దుస్తులు ధరించి, ఆలయ ఛత్రాలు పట్టుకుని గిరిజ వాయిద్య పరికరాలు మోగిస్తూ, స్వామివారికి సమర్పించేందుకు తీపి పదార్థాలు, పళ్లు, పూలను కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఉదయం ఆలయంలో ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు పూర్తయిన తర్వాత ఆ కొండజాతి భాషలో దేవుడిని కీర్తిస్తూ పెద్దలు శ్రావ్యంగా తాళయుక్తంగా పాడుతుండగా అందరూ తమ సంప్రదాయ నృత్యాలతో అందరినీ అలరించారు. యేడాదికొకమారు మాత్రమే ఆ పరమేశ్వరుడి దర్శనం లభిస్తుండడంతో చుట్టుపక్కల కొండ గ్రామాల ప్రజలంతా వేల సంఖ్యలో గుడి చుట్టూ గుమికూడారు. రాత్రి ఏడు గంటల సమయంలో ఆలయంలో మళ్ళీ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన మీదట పూజారులు ఆలయ తలుపులు మూసివేశారు. దీంతో మళ్ళీ యేడాది వరకూ ఆ పరమేశ్వరుడి దర్శనం లభించదంటూ ఆ కొండజాతి ప్రజలంతా కొండదిగి ఇళ్ళకు చేరుకున్నారు.



పూజా వస్తువులతో పూజారులను ఛత్రాల నీడన కొండపైకి తీసుకెళుతున్న పడుకర్ కుల పెద్దలు



ఏడాదికొకమారు లభించే ఈశ్వరుడి దర్శనం కోసం క్యూలైన్‌లో వెళుతున్న మహిళలు

## ఘనంగా ఏవీటీబీవీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



దాతను సత్కరిస్తున్న తెలుగు బేరివైశ్య సభ నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆయిర వైశ్యర్ తెలుగు బేరివైశ్య సభ (ఏవీటీబీవీఎస్) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిరువత్తియూర్ హైరోడ్డులో ఉన్న గౌరీ ఆశ్రమంలో ఆదివారం సాయంత్రం ప్రార్థన, జ్యోతిప్రజ్వలన వ్యవస్థాపకుల చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ప్రారంభమైన సభకు ఏవీటీబీవీఎస్ అధ్యక్షులు బెల్లపు రవీంద్ర చెట్టి (బీవీఆర్)సారథ్యం వహించగా, కార్యదర్శి పీజీ ఆరుముగమ్ వార్షిక నివేదిక వినిపించారు. ఉపాధ్యక్షులు చింతు పుల్లయ్య, పొక్కాలి బాలాజీ, ట్రెజరర్ పంచేటి గిరిధర్, ఉపకార్యదర్శులు ఎం.బాబు, మూర్తి చెన్నకేశవులు, కమిటీ సభ్యులు ఏ.గురునాధం, పి.కామేశ్వరరావు,బి.కృష్ణయ్య, ఎం.నారాయణ, ఎ.పురుషోత్తం, డి.పురుషోత్తం, వై.పెంచలయ్య, వై.రమణయ్య, వైస్ చైర్మెన్స్ అయోధ్య జయకృష్ణ, మల్లపు నరేష్, మొలగనూరు విజయ్ కుమార్, ఆర్గనైజర్లు మునిరమణయ్య, ఆటపాక యోగేష్, ఎంఆర్ సుబ్రమణ్యం, జీవీ జ్యోతి, సర్వేపల్లి జగదీష్‌బాబు పర్యవేక్షించిన ఈ వేడుకల్లో ఫౌండర్స్ డే సందర్భంగా నిర్వహించిన క్రికెట్, క్యారమ్స్, డ్రాయింగ్, ఛెస్, రంగోళి, పాటలు, వక్తృత్వ, షటిల్ కాక్ తదితర పోటీల విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు దాతలు, సీనియర్ సిటిజన్లు, సంఘ సేవకులను ఘనంగా సత్కరించారు.

## తగ్గిన ద్రాక్ష ధరలు



పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర, మహారాష్ట్ర రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ద్రాక్ష దిగుమతులు పెరడంతో వాటి ధరలు తగ్గాయి. జనవరి నుంచి ద్రాక్ష పండ్ల సీజన్ ప్రారంభమవుతుంది. రాష్ట్రంలోని తేని, దిండుగల్, కోవై, కృష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లో అధికంగా రైతులు ద్రాక్ష సాగు చేస్తుంటారు. ప్రస్తుతం సీజన్ కావడంతో కోయంబేడు మార్కెట్‌కు ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి ద్రాక్ష దిగుమతులు పెరిగాయి. దీంతో కిలో పచ్చ ద్రాక్ష రూ.100, విత్తనాలు లేని నల్ల ద్రాక్ష రూ.200లకు విక్రయమవుతోంది. రాబోయే రోజుల్లో దిగుమతులు మరింత పెరిగే అవకాశముండడంతో ధర తగ్గే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

## పళని ఆలయ రథానికి కొత్త మెరుగులు

### ● వైభవంగా సాగిన ముందస్తు రథయాత్ర



ముందస్తు రథయాత్రలో పాల్గొన్న భక్తులు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామి వారి ఆరు దివ్యక్షేత్రాల్లో మూడవదైన పళని దండాయుధపాణి ఆలయంలో తైపూస ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన మహారథం మరమ్మతులు పూర్తయ్యాయి. రాష్ట్ర దేవాదాయ శాఖ రూ.46 లక్షలతో ప్రాచీన మహారథానికి మరమ్మతులు నెల రోజులకు పైగా జరిగాయి. ఆ రథం ముందస్తు యాత్ర సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. మహారథంపై భాగాలను బిగించకుండా మహాపీఠంతో కూడిన రథాన్ని పూలతో అలంకరించారు. ఈ రథంపై విఘ్నేశ్వరుడు, మురుగన్, పరమేశ్వరుడు, పార్వతి తదితర దేవతామూర్తులను ధారుశిల్పులు అందంగా మలిచంతో వాటిని తిలకించి భక్తులు పరవశించారు. ప్రత్యేక పూజల అనంతం రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి వీకే శేఖర్‌బాబు ముందస్తు రథయాత్ర ప్రారంభించారు. ఆలయ గిరి ప్రధాన వీధుల్లో ఆ రథాన్ని ఊరేగించారు. ఈ రథయాత్రలో జిల్లా కలెక్టర్ పూంగొడి, మంత్రి ఆర్.చక్రపాణి, ఎంపీ సచ్చిదానందం, జిల్లా ఎస్పీ ప్రదీప్‌కుమార్, సబ్ కలెక్టర్ కిషన్ కుమార్, ఆలయ అధికారులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 5న ప్రారంభమయ్యే తైపూస ఉత్సవాలలో ఈ మహారథాన్ని ఊరేగించనున్నారు.

## ఓలక్కూరు పీహెచ్‌సీలో స్టాలిన్ ఆకస్మిక తనిఖీ



ఆస్పత్రిని పరిశీలిస్తున్న సీఎం

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విల్లుపురంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం ఉదయం బయలుదేరిన ముఖ్యమంత్రి స్టాలిన్ మార్గమధ్యంలో ఓలక్కూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ కేంద్రంలోని వార్డులను, ప్రసూతి వార్డును, ఆపరేషన్ థియేటర్ పరిశీలించారు. ఆ తర్వాత హాజరుపట్టీ తనిఖీ చేశారు. స్టాలిన్‌తోపాటు విల్లుపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ సి.పళని, ప్రాంతీయ వైద్యాధికారి డాక్టర్ సెంథిల్‌కుమార్ ఇతర అధికారులున్నారు.

## యువతలో ఆత్మవిశ్వాసం నింపుతున్న డీఐజీ దంపతులు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి పోలీసు జోన్‌లో డీఐజీలుగా పనిచేసే ఐపీఎస్ దంపతులు యువతలో ఆత్మవిశ్వాసం నింపుతూ సోషల్ మీడియాలో ఇస్తున్న సందేశాలపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వరుణ్‌కుమార్, వందితా పాండే దంపతులు గత డిసెంబర్‌లో డీఐజీలుగా పదోన్నతి పొందారు. ఈ జంట గత కొద్ది నెలలుగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్, ఎక్స్ పేజీల ద్వారా తరచూ యువతలో నిరాశ నిస్పృహలను పోగొట్టి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేలా సంక్షిప్త ప్రసంగాలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం వందితా పాండే ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను రీల్స్‌గా వెలువరించారు. ఆ రీల్స్‌లో జిల్లా ఎస్పీ స్థాయి నుంచి డీఐజీలుగా పదోన్నతి తర్వాత ఆ జంట తమ యూనిఫామ్‌లో స్టార్, అశోక చక్రం లేబుల్స్ ఒకరినొకరు పొందుపరచుకున్న వీడియో ఉంది. దానిని చూసిన నెటిజన్లు వారిని ప్రశంసలతో ముంచెత్తారు.



డీఐజీలు వరుణ్‌కుమార్, వందితా పాండే

## 14 జిల్లాలకు పార్టీ అధ్యక్షుల నియామకం: బీజేపీ


చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీలో 14 జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు. రాష్ట్ర బీజేపీలో ప్రస్తుతం అంతర్గత ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సోమవారం 14 జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల అధికారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకారం, మదురై నగరం-మారిచక్రవర్తి, రామనాథపురం-మురళీధరన్, విల్లుపురం ఉత్తరం-వినాయకం, తిరువళ్లూర్ పడమర-అశ్విన్‌కుమార్, తిరువణ్ణామలై దక్షిణం-రమేష్, దక్షిణ చెన్నై-సంజీవి, చెన్నై తూర్పు-కుమార్, సెంట్రల్ చెన్నై తూర్పు-గిరి, సెంట్రల్ చెన్నై పడమర-లత, చెన్నై పడమర-భాస్కర్, ఉత్తర చెన్నై తూర్పు-నాగరాజ్, ఉత్తర చెన్నై పడమర-బాలాజి, తంజావూరు దక్షిణం-జయసతీష్, కోయంబత్తూర్ ఉత్తరం-కరు.మారిముత్తు.



# ఘనంగా ఎస్ఐబీఎం తెలుగు సేవకుల సదస్సు

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరియమెట్‌లోని సాల్వేషన్ ఆర్మీ హెచ్‌ఆర్‌డీ ఆడిటోరియంలో సౌత్ ఇండియా బాప్టిస్ట్ మిషన్ (ఎస్ఐబీఎం) తెలుగు సేవకుల సదస్సు సోమవారం ఘనంగా జరిగింది. ఎస్ఐబీఎం వ్యవస్థాపక డైరెక్టర్ రెవ.డా.వి.శ్యామ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో నగర శివారు ప్రాంతాలకు చెందిన సుమారు 200 మందికి పైగా పాస్టర్లు, సీనియర్ బోధకులు పాల్గొని విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. జర్మనీకి చెందిన పాస్టర్లు ఆల్ఫ్రెడ్, ఎడ్వర్డ్ విక్టర్, టిమో, రెవ.వి.జేసుదాస్ సందేశం అందించారు. ఎస్ఐబీఎం ప్రధాన కార్యదర్శి నేలటూరి విజయ్‌కుమార్, జనోదయం డైరెక్టర్ గొల్లపల్లి ఇస్రాయేలు, జేసీజీహెచ్‌పీఎఫ్ వ్యవస్థాపకులు ఊటుకూరి దేవదానం పర్యవేక్షణలో జరిగిన ఈ సభలో సాల్వేషన్ ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ డా.ముద్దా అబ్రహాం లింకన్, సీనియర్ పాస్టర్లు రెవ.డా. ఎస్ రాజేంద్రప్రసాద్ రెవ.డా. ఎస్ ప్రకాశ్‌రాజ్, రెవ.డా.దయాపాత్ర, రెవ. అద్దంకి ఐజయ్య, ఈసీఐ బిషప్ ఏబెల్ నీలకంఠన్ తదితరులను నిర్వాహకులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

## సర్వదర్శనానికి 6 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

**శనివారం నాటి హుండీ ఆదాయం:** రూ.3.67 కోట్లు

**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు:** 74,742

**తలనీలాలు సమర్పించినవారు:** 22,466





రాకెట్‌లోని మొదటి దశ



రెండో దశ



మూడో దశ



మూడు దశల అనుసంధానం అనంతరం శిఖర భాగాన అమర్చిన ఉపగ్రహం



ఇంధన ట్యాంకర్లను అమర్చుతున్న శాస్త్రవేత్తలు




అనుసంధానానికి వాహనంలో విడిభాగాలు తీసుకెళ్తున్న దృశ్యం

# ఎగిరేందుకు సిద్ధంగా నావిక్-02

- వందో ఉపగ్రహ ప్రయోగం కావడంతో సర్వత్రా ఆసక్తి
- షార్‌కు చేరుకున్న ఇస్రో చైర్మన్

శ్రీహరికోటలోని అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ ద్వారా 2,250 కిలోల బరువు కలిగిన నావిగేషన్ శాటిలైట్ (నావిక్-02)ను ఈనెల 29న ప్రయోగించనుంది. దేశీయ నావిగేషన్ అవసరాలకు దిక్సూచిగా ఇది తోడ్పడనుంది. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్ఎల్వీని మూడు దశల్లోనే ప్రయోగించనున్నారు. ఇందుకోసం ఇక్కడి శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. షార్ నుంచి వందో ప్రయోగం కావడంతో ఈ రాకెట్ ప్రాముఖ్యత సంతరించుకుంది. దీంతో ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ సోమవారం షార్‌కు చేరుకొన్నారు. డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, శాస్త్రవేత్తలతో చర్చించారు. మంగళవారం తెల్లవారుజామున 2.53 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది. 27.30 గంటల తర్వాత జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. - సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



నావిక్-02 ఉపగ్రహం



వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ తరలింపు ఇలా

### తాజా ఉపగ్రహ విశేషాలు

- జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ పొడవు 50.9 మీటర్లు
- ఈ ఉపగ్రహం పన్నెండేళ్లపాటు రోదసీలో సేవలందిస్తుంది.
- 420.7 టన్నుల బరువుతో నింగికి బయలు దేరుతుంది.
- మొదటి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ మూడు దశల అనుసంధానం పూర్తిచేసి ప్రయోగ వేదికకు తరలించారు.
- శిఖరభాగాన ఉపగ్రహాన్ని పొందికగా అమర్చే ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది.
- బెంగుళూరు కేంద్రం నుంచి వచ్చిన ఉపగ్రహాన్ని క్లీన్‌రూంలో పలు తనిఖీలు నిర్వహించారు.
- హీట్‌షీల్డ్ క్లోజ్ చేసిన విభాగాన్ని రాకెట్ శిఖర భాగంలో అమర్చేందుకు ఎస్ఎస్ఏబీ నుంచి వ్యాబ్‌కు తరలించి అనుసంధానించారు.
- రాకెట్‌కు రెండు స్థాయిల్లో తనిఖీలు చేసి ప్రీ కౌంట్‌డౌన్ రిహార్సల్‌ను కూడా విజయవంతంగా నిర్వహించారు.

## పాదయాత్ర భక్తులకు అన్నదానం



తిరుత్తణి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెళ్లే వెయ్యి మంది భక్తులకు ఆదివారం రాత్రి అన్నదానం చేశారు. ప్రతి ఏడాది తిరువణ్ణామలై, సెంజి సహా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు షోలింగర్, పల్లిపట్టు, కార్వేట్ నగరం మీదుగా తిరుమల వెళుతుంటారు. వారికి 30 ఏళ్లుగా వెంకటేశ్వర బస్సు యజమాని ఆర్ముగం అన్నదానం చేస్తున్నారు. ఆ క్రమంలో, ఈ ఏడాది ఆదివారం రాత్రి ఆర్ముగం, జానకిరామన్, అన్నామలై సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు.

## విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



విద్యార్థినికి యూనిఫాం అందజేస్తున్న సీజే శ్రీనివాసన్

తిరుత్తణి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం సందర్భంగా పల్లిపట్టు నార్త్ యూనియన్ డీఎంకే ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రి, యూనిఫాం అందజేశారు. కొల్లగుప్పం పంచాయతి యూనియన్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి సీజే శ్రీనివాసన్ పాల్గొని, విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా డిప్యూటీ కో-ఆర్డినేటర్ జె.దండపాణి, జిల్లా కళలు, సాహిత్యం, హేతువాద మండలి నిర్వాహకులు పన్నీర్‌సెల్వం, వైకుంఠం, పరశురామన్, తులసిరామన్, రవి, పండరవేడు, కరుణామూర్తి, దామోదరన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ వితరణ



యంత్రం అందజేస్తున్న చెంగల్రాయ నాయుడు దంపతులు

తిరుత్తణి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పల్లిపట్టు పట్టణంలోని పంచాయతి యూనియన్ ప్రాథమిక పాఠశాలకు అదే ప్రాంతానికి చెందిన చెంగల్రాయ నాయుడు-తులసి దంపతులు నీటి శుద్ధీకరణ యంత్రం వితరణగా అందజేశారు. ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్ముగంకు యంత్రాన్ని చెంగల్రాయ నాయుడు దంపతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మాజీ అధికారి మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు పళని, హేమలత, సుకుమార్, భారతి, దేవి, షహనాజ్ బేగం, లయన్స్ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## 1.94 కోట్ల మందికి పొంగల్ కానుక

పెరంబూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన పొంగల్ బహుమతిని 88 శాతం రేషన్ కార్డుదారులకు అందజేశారు. మంత్రి పెరియకరుప్పన్ మాట్లాడుతూ... సీఎం ఆదేశాల మేరకు బియ్యం కార్డుదారులకు కిలో పచ్చిబియ్యం, కిలో చక్కెర, ఒక చెరకుగడ ఈనెల 9నుంచి పంపిణీ చేశారు. 2.20 కోట్ల మంది కార్డుదారులకు పొంగల్ కానుక అందించాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1.94 కోట్లమందికి (80 శాతం) పంపిణీ చేసినట్లు తెలిపారు.

## రిటైర్డ్ రవాణా ఉద్యోగుల కోసం రూ.206కోట్లు కేటాయింపు

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థలో పదవీవిరమణ చేసిన కార్మికుల సంక్షేమార్థం రాష్ట్రప్రభుత్వం రూ.206కోట్లు కేటాయించింది. 2023వ సంవత్సరం పదవీవిరమణ పొందిన రవాణా శాఖ ఉద్యోగులకు కోసం వడ్డీలేని రుణం ఇచ్చేందుకు అవసరమైన నిధులు కేటాయించాల్సిందిగా రవాణాశాఖ రాష్ట్రప్రభుత్వానికి లేఖరాసింది. ఈ అభ్యర్థనను పరిశీలించిన ప్రభుత్వ రూ.206కోట్లను కేటాయించినట్లు సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

# 29న డీఎంకే ఎంపీల సమావేశం

పెరంబూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీల సమావేశం ఈ నెల 29వ తేది జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ఒక ప్రకటనలో తెలిపారు. తేనాంపేటలోని అన్నా అరివాలయం 'మురసోలి మారన్' ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ పాల్గొననున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం కేంద్ర బడ్జెట్ సహా పలు అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు ప్రకటనలో తెలిపారు.

## అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి: టీటీడీ ఈవో



అమ్మవారి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం

తిరుచానూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం జేఈవో వీరబ్రహ్మంతో కలిసి అమ్మవారి ఆలయ పరిసరాలు, పుష్కరిణి, ఉద్యానవనం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఈవో మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనానికి ప్రతిరోజు 25వేలమందికి పైగా భక్తులు వస్తున్నారన్నారు. దీనికి తగ్గట్టుగా సౌకర్యాలు పెంచేవిధంగా మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పీఏసీని మరో చోటుకు మార్చే ఆలోచన చేస్తున్నామన్నారు. భక్తులకు టిక్కెట్లు జారీ, లడ్డూ కౌంటర్ల వద్ద స్థలాభావం ఉందన్నారు. దీనిపై మరిన్ని మార్పులు చేస్తామన్నారు. తోళ్లప్పగార్డెన్‌లోని కల్యాణ మండపాల గురించి ఆరా తీశారు. టీటీడీ అధికారులు బాలాజీ, సత్యనారాయణ, గోవిందరాజన్, శ్రీరాముడు తదితరులు పాల్గొన్నారు.

## పంటలను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు



మామిడితోట కంచెకు ఏర్పాటుచేసిన రాతి కూసాలను విరిచేసిన ఏనుగు



ఏనుగు దాడిలో ధ్వంసమైన వక్కచెట్టు

కల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లి వద్ద ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు కొబ్బరి, మామిడి, వక్క తదితర పంటలను ధ్వంసం చేసింది. వారంరోజుల క్రితం మండలంలోకి ప్రవేశించిన ఒంటరి ఏనుగుపాళెం పంచాయతీ సరిహద్దులోని అటవీప్రాంతంలో ఉన్న చింతలవంక, సూరప్పచెరువు వద్ద తిష్ట వేసింది. రాత్రి వేళ పంటలను ధ్వంసం చేస్తూ పగలు అడవిలోకి చేరుకుంటోంది. ఆదివారం రాత్రి కుమ్మరిపల్లిలోని రైతు ధర్మేంద్ర మామిడితోటలోకి ప్రవేశించిన ఏనుగు 12 కొబ్బరిచెట్లు, 8 మామిడి చెట్లు, 2 వక్కచెట్లను ధ్వంసం చేసింది. మామిడితోట కంచెకు ఏర్పాటుచేసిన రాతికూసాలను విరిచేసింది. ఇదేగ్రామంలోని రైతు యోగానంద్‌కు చెందిన జొన్నపంటను తొక్కి నాశనం చేసింది. ఇప్పటికే రెండు పర్యాయాలు మామిడితోటను ఏనుగులు ధ్వంసం చేశాయని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు ధర్మేంద్ర కోరారు.

## ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు

- సుభాష్ పాలేకర్ వెల్లడి




సదస్సులో ప్రసంగిస్తున్న సుభాష్ పాలేకర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి చాలా మేలు జరుగుతుందని పద్మశ్రీ సుభాష్ పాలేకర్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దీనివల్ల రైతుకు ఆర్థిక భారం తప్పుతుందన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు అవసరం లేని వ్యవసాయ విధానాన్ని అనుసరించాలన్నారు. ఒక్క దేశవాళీ ఆవుతో 30 ఎకరాల సేద్యం చేయొచ్చన్నారు. ఈ వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సుభాష్ పాలేకర్ పరిశీలించారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ.. మళ్ళీ రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరించడం ద్వారా అన్ని విధాలుగా మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు రైతులతో వర్క్‌షాప్

ప్రకృతి వ్యవసాయంపై బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో రైతులతో సుభాష్ పాలేకర్ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఐదు రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది రైతులు పాల్గొంటారని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ తెలిపారు.

## మంత్రి రాజకన్నప్పన్‌కు హైకోర్టులో చుక్కెదురు

ప్యారీస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి రాజకన్నప్పన్‌కు వ్యతిరేకంగా దాఖలైన ఎన్నికల కేసు విచారణపై స్టే విధించేందుకు మద్రాస్ హైకోర్టు నిరాకరించింది. 2021వ సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రామనాథపురం జిల్లా ముదుకులత్తూరు నియోజకవర్గంలో రాజకన్నప్పన్ డీఎంకే అభ్యర్థిగా పోటీచేసినప్పుడు పలుగ్రామాల్లో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొన్నారని పేరయూర్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ రామనాథపురం జిల్లా ప్రిన్సిపల్ కోర్టులో పెండింగులో ఉంది. అదేవిధంగా శివగంగా జిల్లా మానామదురై నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థిగా పోటీ చేసిన తమిళరసికు మద్దతుగా రాజకన్నప్పన్ 2021 ఏప్రిల్ 2న ప్రచారంలో పాల్గొన్న సమయంలో మరోసారి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి 154 వాహనాల్లో వెళ్లారని ఆయనపై దాఖలైన మరోకేసు కూడా విచారణలో ఉంది. ఈ రెండు కేసుల విచారణకు స్టే విధించాలని, కేసులు రద్దు చేయాలని కోరుతూ, మంత్రి రాజకన్నప్పన్ తరఫున మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి వేల్ మురుగన్ సమక్షంలో హాజరైన పిటిషనర్ తరుపు న్యాయవాది రాజకన్నప్పన్‌కు వ్యతిరేకంగా విచారణ జరిపేందుకు స్టే విధించాలని వాదించారు. ఇందుకు నిరాకరించిన న్యాయమూర్తి రామనాథపురం, శివగంగా కోర్టులలో పెండింగులో ఉన్న కేసులకు సంబధించి మూడు వారాల్లో దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా పోలీసులను ఆదేశించి, తదుపరి విచారణను ఫిబ్రవరి 10వ తేదీకి వాయిదా వేశారు.

## అన్నావర్సిటీ అత్యాచారం కేసు... వచ్చే నెలలో ఛార్జిషీటు దాఖలు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో గత డిసెంబర్ 23న విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసుపై విచారణ జరుపుతున్న ముగ్గురు మహిళా ఐపీఎస్‌లతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం వచ్చే నెల ఛార్జిషీటు దాఖలు చేయనుంది. ఈ అత్యాచారం కేసు నిందితుడు జ్ఞానశేఖరన్ వద్ద వారం రోజులపాటు జరిపిన విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అన్నా విశ్వవిద్యాలయం చేరువలో బిర్యానీ దుకాణం నడిపిన జ్ఞానశేఖరన్ సాయంత్రం అయితే పోలీసు దుస్తులు ధరించి ఆ విశ్వవిద్యాలయంలో తిరిగేవాడని తెలిసింది. ఆ యూనిఫామ్ ఇచ్చిన కానిస్టేబుల్ గురించి కూడా సిట్ అధికారులు కనుగొన్నారు. జ్ఞానశేఖరన్ ఇప్పటివరకూ ముగ్గురు యువతులపై అత్యాచారానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. బిర్యానీ దుకాణం నడుపుతుండటం వల్ల అతడికి సుమారు 40 మంది పోలీసులతో పరిచయాలు ఏర్పడ్డాయని, వీరిలో కొంతమంది పోలీసు అధికారులు కూడా ఉన్నట్టు సమాచారం. ఇక కోట్టూరుపురం పోలీసుస్టేషన్‌లో అత్యాచారం కేసు ప్రాథమిక దర్యాప్తు నివేదిక లీక్ అయిన సంఘటనకు సంబంధించి ఓ రైటర్‌కు జ్ఞానశేఖరన్‌తో పరిచయం ఉందని సిట్ అధికారులు కనుగొన్నారు. ఎఫ్ఐఆర్ లీక్ అయిన సంఘటనకు సంబంధించి మొత్తం 13 మంది నిందితులుగా ఉన్నారని సిట్ అధికారులు తెలిపారు. జ్ఞానశేఖరన్ వాంగ్మూలాన్ని అధికారులు వీడియో తీసి భద్రపరిచారు. రాష్ట్రంలో అత్యాచారం కేసుల్లో 90 రోజుల్లోగా నిందితుడికి శిక్ష విధిస్తున్నారని, ఈ కేసులోనూ మూడు నెలల్లోగా నిందితుడికి కఠిన శిక్షపడే దిశగా దర్యాప్తును ముమ్మరం చేసినట్లు సిట్ అధికారులు చెప్పారు. ఫిబ్రవరి రెండోవారంలోగా ఛార్జిషీట్ దాఖలు చేయనున్నామన్నారు. ఇక నిందితుడి కస్టడీ గడువు సోమవారం ముగియడంతో గట్టి భద్రత మధ్య అతడిని పుళల్ జైలుకు తరలించారు.

## అన్నా వర్సిటీకి బాంబు బెదిరింపు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం, ఎంఐటీలో బాంబులు పేలుతాయంటూ ఈమెయిల్ బెదరింపులు వచ్చాయి. ఆదివారం అర్థరాత్రి ఈ రెండు విద్యా సంస్థలకు ఈమెయిల్ ద్వారా సోమవారం వేకువజాములోపు బాంబులు పేలనున్నాయని బెదరింపులు వచ్చాయి. రెండు విద్యా సంస్థల ఉన్నతాధికారుల ఫిర్యాదుపై రెండో చోట్లా పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు జాగిలాలలతో వెళ్ళి తనిఖీ చేశారు. చివరకు ఉత్తుత్తి బెదిరింపేనని నిర్ధారణ అయ్యింది. బాంబు బెదరింపు పేరుతో ఈమెయిల్ పంపినవారిని కనుగొనేందుకు సైబర్ క్రైం విభాగం పోలీసులు రంగంలోకి దిగారు.

## జబగర్ అలి హత్య వ్యవహారం .. నలుగురు తహసీల్దార్ల ఆకస్మిక బదిలీ

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సమాజసేవకుడు జబగర్ అలి హత్యకేసు ఘటనకు సంబంధించి నలుగురు తహసీల్దార్లను ఆకస్మికంగా బదిలీ చేశారు. పుదుకోట జిల్లా తిరుమయం తాలూకాలో ఉన్న రాళ్ల క్వారీలో అవినీతి జరుగుతోందని సమాజ సేవకుడు జబగర్ అలి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 17వ తేది తన ద్విచక్రవాహనంపై వస్తుండగా లారీ ఢీకొని ఆయన మృతిచెందాడు. ఈ మృతిలో అనుమానాలున్నాయనే ఫిర్యాదుతో, ఐదుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తిరుమయం సీఐ గుణశేఖర్‌ను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో, తిరుమయం తహసీల్దార్ పువిఅరసు, ప్రత్యేక తహసీల్దార్ సహా నలుగురిని బదిలీ చేస్తూ కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.